# ద్రవ్యోల్బణాన్ని దాటేద్దాం ఇలా..

## రిటైర్మెంట్ ప్లానింగ్‌పై ధరల ప్రభావమెంత?


**పదవీ** విరమణ అనంతర జీవితం.. ప్రతీ ఒక్కరికీ ఎంతో ముఖ్యం. ముదిమి వయసులో సరిపడా డబ్బుంటే ప్రతీ క్షణం ఆనందకరమే. కానీ ఆర్థిక సమస్యలు తలెత్తితే మాత్రం నరకమే. అందుకే రిటైర్మెంట్ ప్లానింగ్ అనేది తెలివైన పని. కానీ దాని కోసం పెట్టుబడులు పెడుతున్నప్పుడు ద్రవ్యోల్బణం ప్రభావాన్ని పరిశీలించడం చాలా ప్రధానమని మరువద్దు. భవిష్యత్తులో ఆయా వస్తూత్పత్తులు, సేవల ధరల్లో చోటు చేసుకునే పెరుగుదలనే ఈ ద్రవ్యోల్బణం సూచిస్తుంది. ఒకవేళ దీన్ని పరిగణనలోకి తీసుకోకుండా రిటైర్మెంట్ పెట్టుబడులు పెట్టినట్లైతే ఆ వచ్చే సొమ్ము పెరిగిన ధరలకే పోతుంది తప్ప.. మీ అవసరాలకు మాత్రం చాలదు. దీనివల్ల మీ పదవీ విరమణ అనంతర జీవితం కూడా ఆశించిన స్థాయిలో ఆనందంగా ఉండదు. అందుకే ఇప్పటి ద్రవ్యోల్బణం స్థాయి, అప్పటి ద్రవ్యోల్బణం లెక్కల్ని అంచనా వేసి, దానికి తగ్గట్టుగానే పెట్టుబడులకు వెళ్తే లాభదాయకం.

### పొదుపుపై ధరాఘాతం

రిటైర్మెంట్ సేవింగ్స్‌పై ద్రవ్యోల్బణం ప్రభావం నిజంగా చెప్పాలంటే చాలా ఎక్కువే. ఎంతోమంది వృద్ధులు వారి పెన్షన్, రిటైర్మెంట్ ఫండ్స్‌పైనే ఆధారపడి జీవిస్తూంటారు. అయితే పెరిగే ధరలు వారి రిటైర్మెంట్ సేవింగ్స్ వాస్తవ విలువ క్షీణతకు దారితీస్తాయి. దేశంలో ద్రవ్యోల్బణం హెచ్చుతగ్గులు.. సాధారణ వ్యక్తులు, వేతన జీవులనే అధికంగా ప్రభావితం చేస్తుంటాయి. ఉద్యోగాన్ని వీడిన తర్వాత పెన్షన్ ఆదాయంపై జీవించేవారికీ ద్రవ్యోల్బణం కష్టాలు తప్పవు. కాబట్టి ముందుగానే ద్రవ్యోల్బణం అంచనాలతో పెట్టుబడులకు దిగితే ఆ ఇబ్బందులను వృద్ధాప్యంలో అధిగమించవచ్చు. లేకపోతే చాలీచాలని ఆదాయంతో సమస్యల్ని ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

### ఇదీ సంగతి..

రిటైర్మెంట్ సేవింగ్స్‌ను ద్రవ్యోల్బణం ఏవిధంగా ప్రభావితం చేస్తుందో చూద్దాం. ఉదాహరణకు.. నేడు మీ ఖర్చులు రూ.5,000లుగా ఉన్నాయి. అయితే 6 శాతం ద్రవ్యోల్బణం ప్రభావంతో భవిష్యత్తులో ఈ ఖర్చు రూ.5,300లకు పెరిగిందనుకుంటే, వచ్చే 30 ఏండ్లలో.. అది దాదాపు రూ.28,700లను తాకగలదు. దీన్ని బట్టి ఒక్క సారి ఆలోచించండి..



మీరు ఈరోజు బాగానే పొదుపు చేస్తున్నామనుకుంటున్న మొత్తాలు, అప్పటికి ఎంతమేరకు మీ ఖర్చుల్ని భరించగలవోనని. ఇక ద్రవ్యోల్బణం ప్రభావం నుంచి మీ రిటైర్మెంట్ ఫండ్స్ రక్షణకు ఈ విధంగా ప్రయత్నించవచ్చని కొందరు నిపుణులు సలహా ఇస్తున్నారు. వాటి ప్రకారం..

### స్టాక్ మార్కెట్లు

ద్రవ్యోల్బణాన్ని మించి ఆకర్షణీయ రాబడులను అందుకోవాలంటే.. స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులను పరిశీలించడం ఉత్తమం. దీర్ఘకాలంలో పెద్ద ఎత్తున ఆదాయం లేదా లాభాలను పొందాలంటే ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ సరి అని చెప్పవచ్చు. నిజానికి స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. అయితే షార్ట్-టర్మ్ ఇన్వెస్టర్లకే ఈ రిస్క్ ఉంటుందని కూడా గుర్తుంచుకోవాలి. రోజూ చూస్తున్న ఒడిదొడుకులు వీరినే ఎక్కువగా ప్రభావితం చేస్తాయి. లాంగ్-టర్మ్ ఇన్వెస్టర్లకు ఇది తక్కువే. అందుకే స్వల్పకాల లక్ష్యాలతో ఈక్విటీల్లో పెట్టుబడులకు దిగవద్దు. అందుకు భిన్నంగా ముందుకెళ్తే.. ద్రవ్యోల్బణాన్ని మేనేజ్ చేసే ఆకర్షణీయ రిటర్న్స్‌ను సొంతం చేసుకోవచ్చు. ఆర్థిక నిపుణుల సలహాలు తీసుకున్నట్టైతే మరింతగా సత్ఫలితాలుంటాయి.

### పెట్టుబడుల వర్గీకరణ

పెట్టుబడుల వర్గీకరణ వాటికున్న రిస్కుల్ని తగ్గించగలదు. అందుకే మీ పోర్ట్‌ఫోలియోలో రకరకాల పెట్టుబడి సాధనాలను చేర్చుకోండి. నిపుణుల సూచనల ప్రకారం.. స్టాక్స్‌లో 30 శాతం, బాండ్లలో 30 శాతం, రియల్ ఎస్టేట్‌లో 30 శాతం, బంగారంపై మిగతా 10 శాతం పెట్టుబడులు పెడితే లాభదాయకంగా ఉంటుంది. ఇలా చేస్తే ఆయా




రంగాల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించవచ్చు. ఒకట్రెండు రంగాల్లో నష్టాలు వాటిల్లినా.. మిగతా రంగాల్లోని లాభాలతో వాటిని భర్తీ చేసుకోవచ్చు. ముఖ్యంగా అధిక ద్రవ్యోల్బణం ఉన్నప్పుడు ఈ పెట్టుబడులు కలిసొస్తాయి. అందుకే ఒకే రంగంపై దృష్టి పెడుతూ అందులోనే మొత్తం సొమ్మును పెట్టుబడిగా పెడితే పెద్దగా వృద్ధికి ఆస్కారం ఉండదు. పైగా సదరు రంగం కుదేలైతే మనమూ మునిగిపోతాం.

### బాండ్లు, ఫండ్లు

ద్రవ్యోల్బణం అధికంగా ఉన్నప్పుడు స్వల్ప కాలంలో మంచి రాబడులను అందుకోవడానికి ఈ ఫండ్లు చక్కగా దోహదం చేయగలవు. సాధారణంగా ద్రవ్యోల్బణం ఎక్కువగా ఉంటే, వడ్డీరేట్లూ ఎక్కువగానే ఉంటాయి. ధరల్ని అదుపు చేయడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) రెపోరేటును పెంచేస్తుంది. దీనివల్ల బ్యాంకుల రుణాలపై వడ్డీరేట్లూ పెరుగుతాయి. ఈ నేపథ్యంలోనే ఫ్లోటింగ్-రేట్ బాండ్లు, ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లు లాభదాయకం. కాబట్టి ద్రవ్యోల్బణం ఎక్కువగా నమోదవుతున్నప్పుడు ఈ ఫండ్లలో ఇన్వెస్ట్‌మెంట్లకు దిగితే అదనపు ఆదాయం అందుకోవచ్చు.

### చివరగా..

ధరలు పెరుగుతున్నప్పుడు రోజువారీ అవసరాల కోసం పెట్టే ఖర్చులూ పెరుగుతూపోతుంటాయి. దీనివల్ల నెలవారీ బడ్జెట్ తలకిందులవుతూ ఉంటుంది. కనుక ప్రతీ నెలా ఖర్చులు ఏవి? అన్నదానిపై స్పష్టత ఉంచుకుంటే ఎక్కడ అదనపు ఖర్చులుంటున్నాయో గుర్తించవచ్చు. అలాగే మ్యూచువల్ ఫండ్స్, సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల ద్వారా కూడా పెట్టుబడులకు దిగి స్టాక్ మార్కెట్‌లో ప్రవేశించవచ్చు. సురక్షితమైన పెట్టుబడుల కోసం బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), కేంద్ర ప్రభుత్వ పథకాలను పరిశీలించవచ్చు. అధిక వడ్డీనిచ్చే పోస్టాఫీస్ స్కీములూ లాభదాయకమే. పైగా వీటికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ ఉంటాయి.




## పాన్ కార్డ్ 2.0 షురూ

### ఫీచర్లు, భద్రతా ప్రయోజనాలు తెలుసా?


**ఒకప్పటితో** పోల్చితే దేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. అందులో ముఖ్యమైనది పాన్ (పర్మనెంట్ అకౌంట్ నంబర్) కార్డ్. ఈ కార్డ్ లేకపోతే చాలా కష్టాలే వచ్చిపడుతాయి. ఆదాయ పన్ను రిటర్న్ (ఐటీఆర్)ల దగ్గర్నుంచి, బ్యాంకుల్లో ఖాతాలను తెరవడందాకా పాన్ కార్డ్ ఎంతో అవసరం మరి. అయితే కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పాన్ కార్డ్ 2.0 ప్రాజెక్ట్‌ను మొదలుపెట్టింది.

**ఇదీ సంగతి..**

పాన్ కార్డ్ 2.0 అనేది ఓ సెక్యూర్ డాక్యుమెంట్. ఏటీఎం కార్డు తరహాలోనే దీని పరిమాణం ఉంటుంది. భవిష్యత్తులో మీరు పాన్ కార్డ్ పొందినట్టయితే ప్రాజెక్ట్ 2.0 కింద మాత్రమే జారీ చేయబడుతాయి. ఇక పాన్ కార్డ్ 2.0లో ఓ ప్రత్యేక రకానికి చెందిన క్యూఆర్ కోడ్, చిప్ ఉంటుంది. ఎన్నెన్నో ప్రత్యేక ఫీచర్లు వీటి సొంతం. సైబర్ మోసాలు పెరిగిన ప్రస్తుత తరుణంలో ఖాతాదారులు, కార్డుదారులు వాటి బారినపడకుండా రక్షించడంలో ఇదే కీలక పాత్ర పోషిస్తుంది. ఇదిలావుంటే కేంద్ర ప్రభుత్వం ఈ కార్డుల జారీకి ఎలాంటి చార్జీలను వసూలు చేయబోదు.

**పాన్ కార్డ్ పొందడం ఎలా?**

ఇందు కోసం తొలుత ఆదాయ పన్ను (ఐటీ) శాఖ అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. అప్పుడు తెరుచుకొనే వెబ్‌పేజ్‌పై మీ పేరు, పుట్టిన తేదీ, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ తదితర కావాల్సిన సమాచారం అంతటిని ఎంటర్ చేయాలి. అప్లికేబుల్ టిక్ బాక్స్‌ను ఎంచుకొని, స్వేచ్ఛగా సబ్‌మిట్‌పై క్లిక్ చేయాలి. ఆ తర్వాత స్క్రీన్‌పై ఓ కొత్త పేజీ తెరుచుకుంటుంది. అక్కడ ఆదాయ పన్ను శాఖతో మీ ప్రస్తుత వివరాలను పరిశీలించుకోవాలి. అనంతరం మీ మొబైల్ ఫోన్ నంబర్‌కు వన్-టైం పాస్‌వర్డ్ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసి వెరిఫై చేసుకోవాలి. అయితే ఈ ఓటీపీ 10 నిమిషాలు మాత్రమే పనిచేయగలదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆ సమయం దాటితే మరో ఓటీపీ అవసరం ఉంటుంది. ఇక అప్పుడు పేమెంట్ పద్ధతిని ఎంచుకొని చెల్లింపులు జరపాలి. షరతులను అంగీకరిస్తున్నట్టు టిక్ బాక్స్‌ను ఎంచుకోవాలి. ఆ తర్వాత మరొక్కసారి పేమెంట్ మొత్తాన్ని సరిచూసుకొని, నిర్ధారించుకోవాలి. ఆపై కంటిన్యూపై క్లిక్ చేయాలి. అప్పుడు మీ ఈ-మెయిల్ ఐడీకి పాన్ కార్డ్ రాగలదు.




### పాత కార్డ్ పరిస్థితేంటి?

*పాన్ కార్డ్ 2.0 రాబోతున్న నేపథ్యంలో అనేకానేక ప్రశ్నలు మిమ్మల్ని తొలిచేస్తు ఉండవచ్చు. అందులో కొత్త కార్డులు వస్తే.. ఇప్పుడున్న పాన్ కార్డులు నిరుపయోగంగా మారిపోతాయా? అన్నదీ ఉండనే ఉంటుంది. అయితే పాన్ కార్డ్ 2.0 వచ్చాక కూడా పాత పాన్ కార్డులు ఎప్పట్లాగే పని చేస్తాయి. పాత పాన్ కార్డులతో మీ పనేమీ ఆగిపోదు. అలాగే మీ పాన్ కార్డులో ఏవైనా తప్పులు దొర్లినా వాటిని సరిచేసుకోవచ్చు. సైబర్ దాడులు, ఆర్థిక మోసాలను అరికట్టేందుకే ఈ పాన్ కార్డ్ 2.0 ప్రాజెక్టును కేంద్రం మొదలు పెట్టిందని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. కొత్త పాన్ కార్డులతో ఆర్థికపరమైన పనులు మరింత సులువు కానున్నాయని అంటున్నారు.*

## గ్రాట్యుటీ లెక్క తెలుసా?

**ప్రైవేట్** కంపెనీల్లో ఈపీఎఫ్ సదుపాయాన్ని అందుకొనే ఉద్యోగులకు ఐదేండ్ల తర్వాత గ్రాట్యుటీ పొందే వీలున్నది. అయితే ఈ గ్రాట్యుటీ ఎంత వస్తుంది? దాని లెక్క ఏమిటి? అన్నది చాలా తక్కువ మందికే తెలుసు. నిజానికి ఐదేండ్లలోపే సర్వీసు ఉన్నప్పటికీ ఏదైనా ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అంగవైకల్యం ఏర్పడ్డా, లేదా చనిపోయినా గ్రాట్యుటీకి అర్హులే. ఇక ఈ గ్రాట్యుటీ లెక్కింపు విషయానికొస్తే.. ఉదాహరణకు ఓ కంపెనీలో పనిచేస్తున్న ఉదయ్‌కి అక్కడ ఆరేండ్ల అనుభవం ఉన్నది. ఆయన బేసిక్ సాలరీ, డీఏ కలిపి నెలకు రూ.30,000 వస్తున్నది. అప్పుడు గ్రాట్యుటీ రూ.1,03,846 వస్తుంది. ఇందుకు వర్తించే లెక్క ఏమిటంటే? కంపెనీలో ఉదయ్‌కున్న అనుభవం (6 ఏండ్లు)తో ఆయన నెల బేసిక్ సాలరీ, డీఏ (రూ.30,000) మొత్తాన్ని గుణించాలి. ఆ వచ్చిన మొత్తం (రూ.1,80,000)ను 15/26 ఫార్ములాతో మళ్లీ గుణించాలి. అప్పుడు రూ.1,03,846 వస్తుంది. ఇదే ఆరేండ్ల కాలానికిగాను ఉదయ్‌కు వచ్చే గ్రాట్యుటీ మొత్తం. ఇలా ఎన్నేండ్లు పనిచేస్తే అన్నేండ్లు, అప్పటి వారి బేసిక్ పే, డీఏలతో కలిసి గుణించి, ఆ మొత్తానికి 15/26తో మళ్లీ గుణిస్తే గ్రాట్యుటీ వచ్చేస్తుంది. ఉద్యోగి రాజీనామా చేసి వెళ్లిపోయేటప్పుడు కంపెనీలు ఈ లెక్కనే పాటించి చెల్లిస్తాయి. ఒకవేళ మీరు 12 ఏండ్ల 6 నెలలు లేదా 13 ఏండ్ల 6 నెలలు పనిచేస్తే అప్పుడు అక్కడ మీ అనుభవాన్ని 13 లేదా 14 ఏండ్లుగా పరిగణనలోకి తీసుకుంటారు. అలాగే గ్రాట్యుటీ రూ.10 లక్షలు దాటితే దానిపైన ఉండే మొత్తాన్ని ఎక్స్‌గ్రేషియాగా పిలుస్తూ చెల్లిస్తారు.




## లాభాల స్వీకరణకు అవకాశం!

**దేశీయ** స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో ఉన్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు పెట్టుబడులకు ముందుకు రావడం కలిసొచ్చింది. నిజానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు.. మార్కెట్ సెంటిమెంట్‌ను బాగానే దెబ్బతీశాయి. అయితే ఈ ప్రభావం నుంచి తేరుకున్న ఇన్వెస్టర్లు.. గత వారం కొనుగోళ్లకు మద్దతిచ్చారు. దీంతో అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 3,076.60 పాయింట్లు ఎగబాకి 76,905.51 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 953.20 పాయింట్లు ఎగిసి 23,350.40 దగ్గర ముగిసింది. అయితే గత వారం వరుస లాభాల్లో ఉండటంతో ఈ వారం మదుపరులు లాభాల స్వీకరణకు దిగే వీలుందన్న అంచనాలు గట్టిగా వస్తున్నాయి. కానీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ స్థిరంగా బలపడుతుండటంతో మార్కెట్లు పరుగులు పెట్టవచ్చని కూడా పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,600-23,900 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

*గమనిక..*

***స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడుదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.***

## తెలంగాణ మట్టి వాసన గుబాళించే కథతో..



అగ్ర నిర్మాత దిల్ రాజు.. తన తమ్ముడు శిరీష్ కుమారుడైన ఆశిష్ హీరోగా ఓ భారీ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఓ కొత్త కుర్రాడు దర్శకత్వంలో ఈ సినిమా ఉండబోతున్నదని తెలుస్తున్నది. ఇప్పటివరకూ ఆశిష్ నటించిన రౌడీ బాయ్స్, లవ్ మీ చిత్రాలకు భిన్నంగా పూర్తి తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ సినిమా ఉంటుందని విశ్వసనీయ సమాచారం. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపైన కథతో రూపొందనున్న ఈ సినిమాలో.. విలేజ్ ఎమోషన్స్, ఫ్యామిలీ డ్రామా, వైలెన్స్.. అన్నీ కంటెంట్‌కి తగ్గట్టుగా ఉంటాయని, ఆశిష్ కేరక్టర్ కూడా ఊరమాస్‌గా డిజైన్ చేయడం జరిగిందని తెలుస్తున్నది. మరో విషయం ఏంటంటే.. బతుకమ్మ పండుగ ఈ కథలో కీలకమట. మొత్తంగా తెలంగాణ మట్టివాసన గుబాళించే కథతో ఈ సినిమా రూపొందనున్నదని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన మిగతా వివరాలు తెలియాల్సివుంది.

చిత్రం

## శ్రీలంకలో సాంగ్ షూట్



సక్సెస్, ఫెయిల్యూర్‌లకు సంబంధం లేని స్టార్‌డమ్ విజయ్ దేవరకొండది. సరైన సినిమా పడితే.. రికార్డులు బద్దలుకొట్టడం అతనికి పెద్ద విషయం కాదు. అలాంటి విజయం కోసం తనతో పాటు తన అభిమానులు కూడా ఆశగా ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఆయన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'కింగ్ డమ్' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. గౌతమ్ తిన్ననూరి 'జెర్సీ' సినిమా వాణిజ్యపరంగా విజయాన్ని సాధించడంతోపాటు విమర్శకుల ప్రశంసలు కూడా అందుకుంది. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో గౌతమ్ చేస్తున్న 'కింగ్ డమ్' సినిమా కూడా మనసుల్ని మెలిపెట్టే భావోద్వేగాలతో విభిన్నంగా ఉంటుందని తెలుస్తున్నది. 70శాతం చిత్రీకరణ పూర్తయింది. వారం రోజుల షెడ్యూల్‌ని మేకర్స్ శ్రీలంకలో ప్లాన్ చేశారు. అక్కడ ఓ లవ్‌సాంగ్‌తో పాటు కీలక సన్నివేశాలు చిత్రీకరిస్తారట. అందుకే చిత్ర యూనిట్ శ్రీలంక పయనమయ్యారు. దీనికి సంబంధించిన విజయ్ దేవరకొండ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రౌడీ ట్రెండీ సమ్మర్ వేర్‌లో స్టైల్ ఐకాన్‌గా ఈ ఫొటోల్లో విజయ్ కనిపిస్తున్నారు. మే 30న ఈ సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్యలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, సమర్పణ: శ్రీకర స్టూడియోస్, నిర్మాణం: సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్.



## విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నా

'దర్శకుడు వెంకీ నాకు దేవుడిచ్చిన తమ్ముడు. నామీద తనకున్న ప్రేమ ఈ సినిమాలో కనిపిస్తుంది. ఈ సినిమా రేపు విజయం సాధిస్తే.. ఆ క్రెడిట్ పూర్తిగా వెంకీ కుడుములదే. డేవిడ్ వార్నర్ సార్ ఈ సినిమా చేయడం వల్ల సినిమాపై ఆడియన్స్‌లో ఆసక్తి పెరిగింది. సినిమా విజయంపై పూర్తి నమ్మకంతో ఉన్నా.' అని హీరో నితిన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'రాబిన్‌హుడ్'. శ్రీలీల కథానాయిక. వెంకీ కుడుముల దర్శకుడు. ప్రతిష్టాత్మక మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రంలో ఆస్ట్రేలియా దిగ్గజ క్రికెటర్ డేవిడ్ వార్నర్ ప్రత్యేక అతిథి పాత్ర పోషించడం విశేషం. ఈ నెల 28న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో నితిన్ మాట్లాడారు. 'నన్ను ఓన్ చేసుకొని నాతో నటింపజేసిన టీమ్‌కి థ్యాంక్స్ చెబుతున్నాను. మంచి మనుషులు కలయిక ఈ సినిమా.' అని డేవిడ్ వార్నర్ అన్నారు. అనుకోకుండా చేసిన సినిమా.. అనుకున్న దానికంటే బాగా చేసిన సినిమా 'రాబిన్ హుడ్' అని శ్రీలీల చెప్పారు. 'ఈ సినిమా ఇంతబాగా రావడానికి కారణం నితిన్. అద్భుతమైన టీమ్‌ని నాకిచ్చి ముందుకు నడిపించిన నిర్మాతలకు థ్యాంక్స్. డేవిడ్ వార్నర్ సార్ చేయడం వల్ల సినిమాపై అంచనాలు పెరిగాయి.' అని డైరెక్టర్ వెంకీ కుడుముల పేర్కొన్నారు. డా.రాజేంద్రప్రసాద్, సంగీత దర్శకుడు జి.వి.ప్రకాశ్‌కుమార్, నటి కేతిక, రాహుల్ సంకృత్యన్, వివేక ఆత్రేయ, సాయిరాజేష్, కాసర్ల శ్యామ్, దేవ్ దత్, మైత్రీ శశి, హరి తుమ్మల, ప్రశాంత్ పిన్నమనేని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇంటర్నేషనల్ టాక్సిక్



'కేజీఎఫ్'ఫేం యష్ నటిస్తున్న పాన్ వరల్డ్ యాక్షన్ ఎంటర్టైనర్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో వెంకట్ కె.నారాయణతో కలిసి యష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే. డైరెక్ట్‌గా కన్నడంతోపాటు ఇంగ్లిష్ భాషలో కూడా 'టాక్సిక్' రూపొందుతున్నది. ఉగాది, గుడి పడ్వా, ఈద్ పర్వదినాలను పురస్కరించుకొని వచ్చే ఏడాది మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేయనున్నట్టు మేకర్స్ ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ భారతీయ ప్రాజెక్ట్ ఇంటర్నేషనల్ సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తుందని, అంతర్జాతీయ సినిమారంగంలో అనుభవం, ప్రతిభ ఉన్న వారందరినీ ఈ సినిమా ఒకచోట చేర్చనున్నదని, హిందీ, తెలుగు, తమిళం, మలయాళంతోపాటు ఇతర భాషల్లో కూడా 'టాక్సిక్' అనువాదం కానున్నదని మేకర్స్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. మంటలు, చుట్టూ ఉన్న పొగ మధ్య హీరోను చూపించిన తీరు, ఆ గన్ పట్టుకునే విధానం, హీరో పెట్టుకొని టోపీ ఇవన్నీ పోస్టర్‌లో స్టైలిష్‌గా కనిపిస్తున్నాయి.

## సంబరాల యేటిగట్టులో బ్రిటిషుగా..

బ్లాక్‌బస్టర్ 'విరూపాక్ష' తర్వాత హీరో సాయిదుర్గతేజ్ శక్తిమంతమైన పాత్రలో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'సంబరాల ఏటిగట్టు'. రోహిత్ కె.పి దర్శకుడు. కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మాతలు. సెప్టెంబర్ 25న పానిండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. నటుడు శ్రీకాంత్ ఇందులో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆదివారం ఆయన పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇందులో ఆయన పోషిస్తున్న 'బ్రిటిషు' పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రగ్గడ్ హెయిర్, గడ్డంతో బ్లాక్ కోట్ ధరించి ఫెరోషియస్‌గా కనిపిస్తున్న శ్రీకాంత్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఇప్పటికే విడుదలైన కార్నేజ్ టీజర్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చిందని, లార్జర్ దెన్ లైఫ్ మేనర్‌లో సాయిదుర్గతేజ్ పాత్రను దర్శకుడు రోహిత్ ప్రజెంట్ చేశారని, శరవేగంగా చిత్రీకరణ సాగుతుందని మేకర్స్ తెలిపారు. 125కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఐశ్వర్యలక్ష్మి కథానాయిక. జగపతిబాబు, సాయికుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రివేల్ పళనిస్వామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: ప్రైమ్‌షో ఎంటర్టైన్మెంట్స్.





## ఆ.. మిలమిలమిల మెరుపల్లే

అనుపమ పరమేశ్వరన్ నటిస్తున్న కాన్సెప్ట్ ఓరియెంటెడ్ మూవీ 'పరదా'. దర్శన రాజేంద్రన్, సంగీత కీలక పాత్రధారులు. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకుడు. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పి.వి, శ్రీధర్ మక్కువ నిర్మాతలు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని పాటను మేకర్స్ విడుదల చేశారు. 'ఆ మిలమిలమిల మెరుపల్లే.. సిరులొలికిన మన పల్లె.. చిరునగవుల సొగసరివల్లే..' అంటూ సాగే ఈ గీతాన్ని వనమాలి రాయగా, గోపీసుందర్ స్వరపరిచారు. శ్రీకృష్ణ, రమ్య బెహరా ఆలపించారు. తెలుగు సాంప్రదాయం ఉట్టిపడేలా ప్లెజెంట్‌గా ఈ పాట విజువల్స్ ఉన్నాయి. అనుపమ పరమేశ్వరన్ డాన్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణ. ఈ చిత్రానికి కెమెరా: మృదుల్ సుజిత్‌సేన్, నిర్మాణం: ఆనంద మీడియా.



## కచ్చితంగా 'గజనీ 2' తీస్తా..

ఒక్క సినిమాతో భారతీయ సినీపరిశ్రమంతా తనవైపు చూసేలా చేసిన దర్శకుడు ఏఆర్ మురుగదాస్. ఆ సినిమానే 'గజనీ'. తమిళ, తెలుగు భాషల్లోనే కాదు, బాలీవుడ్‌లో పునర్నిర్మిస్తే, అక్కడ కూడా అఖండ విజయాన్ని సాధించిందా సినిమా. ప్రస్తుతం సీక్వెల్స్ ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో 'గజనీ' సీక్వెల్ కోసం ఎదురు చూస్తున్న సినీ ప్రియులు కోకొల్లలు. దర్శకుడు మురుగదాస్ తన తాజా సినిమా సల్మాన్‌ఖాన్ 'సికిందర్' ప్రమోషన్స్‌లో బిజీగా బిజీగా ఉన్నారు. ఈ సందర్భంలో కొందరు అభిమానులు ఆయన్ను 'గజనీ' సీక్వెల్ గురించి అడగ్గా.. వారందరికీ మురుగదాస్ శుభవార్త చెప్పేశారు. ' 'గజనీ 2' రూపొందే అవకాశం ఉంది. ఆ పాత్రను ఆధారంగా చేసుకుని ఎన్ని పార్ట్స్ అయినా క్రియేట్ చేయొచ్చు. సీక్వెల్ విషయంలో నా దగ్గర ఓ ఆలోచన ఉంది. దానిపై వర్క్ చేయాలి. ఫుల్ స్క్రిప్ట్‌ని సిద్ధం చేయాలి. అనుకున్నట్టు అంతా మంచి జరిగితే.. కచ్చితంగా 'గజనీ 2' తీస్తా. తెలుగు, తమిళంలో ఒకే సారి తీయాలనే ఆలోచన కూడా ఉంది.' అన్నారు మురుగదాస్.

## సీఎం పెళ్లాం బయటకొస్తే?..




ఇంద్రజ, అజయ్, జయసుధ, సుమన్ ముఖ్య పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'సీఎం పెళ్లాం'. గడ్డం రమణారెడ్డి దర్శకుడు. బొల్లా రామకృష్ణ నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంచ్ కార్యక్రమంలో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. దర్శకుడు మాట్లాడుతూ ' 'ఒకే ఒక్కడు' సినిమాలో వన్‌డే సీఎంని చూశాం. ఈ సినిమాలో సీఎం పెళ్లాం బయటకు వస్తే ఎలా ఉంటుందో చూపిస్తున్నాం. సామాజిక స్పృహతో కూడిన కథాంశమిది. వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఉంటుంది.' అని తెలిపారు. నవ్వించడంతోపాటు ఆలోచింపజేసే సినిమా ఇదని, రియల్ లైఫ్‌లో జరుగుతున్న సంఘటనలు ఈ సినిమాలో చూస్తారని, ఈ కంటెంట్ ఓరియెంట్ మూవీ అందరికీ నచ్చుతుందని ఇంద్రజ నమ్మకం వెలిబుచ్చారు. ఈ సినిమాలో నటించడం పట్ల నటుడు అజయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. నగేష్, కోటేశ్వరరావు, భరత్, ప్రీతినిగం, రూపలక్ష్మి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: నాగశ్రీనివాసరెడ్డి, సంగీతం: ప్రిన్స్ హెన్రీ.